
హై,హై,
పాలోనియా!
డా॥ చిత్తర్వు మధు



# హైహై పోలీసయ్యా!

డా॥ చిత్తర్వు మధు

వాహిని బుక్ ట్రస్ట్

1.9.286/3 విద్యానగర్, హైదరాబాద్ 500044

**BYE... BYE... POLONIYA!**
*(Serialised in Andhra Prabha Illustrated Weekly)*
*by* ***Dr. Chittarvu Madhu***

First Edition : May, 2007

Publication No. 80

© Author

*Cover Design and Illustrations:*
**BALI**

*Produced & Published by :*
**Vahini Book Trust (V.B.T.)**
1-9-286/3, Vidyanagar
Hyderabad - 500 044.

A
Service Oriented
Institution
Administrated
by
Y.V.S.R.S. SAI

*For Copies :*
Vahini Book Trust, 1-9-286/3, Vidyanagar, Hyderabad - 500 044.
Visalandhra Book House, Bank Street, Hyderabad & Other Branches
Navodaya Book House, Opp: Aryasamaj Mandir, Badi Chowdi, Hyderabad
Navayuga Book House, Sultan Bazar, Hyderabad.
Navodaya Publishers, Governorpet, Vijayawada.

*Typesetting :*
**Rachana Entinti Patrika,** Hyderabad - 500 044

*Printed at :*
**Charita Impressions,** 1-9-1126/B, Azamabad, Hyderabad - 500 020

Total Pages : 262

Price : Rs. 130/- US $ : 10

ISBN 81-88512-79-6

# అంకితం

కొత్త రచయితలని

చిన్నచూపు చూడకుండా

మంచి మనసుతో ప్రోత్సహించిన



శ్రీ వాకాటి పాండురంగరావ్‌గారి

స్మృతికి

ఈ

నవల

అంకితం!

- డా॥ చిత్తర్వు మధు



# హైహైపోలోసియా! నవల గురించి....

నేను రాసిన 'ఐసిసియు' నవలకి ఇది తరువాత భాగం లాంటిది. మోడరన్ హార్ట్ క్లినిక్ తగులబెట్టి పారిపోయిన విలన్ డాక్టర్ రావ్ దీంట్లో మళ్ళీ ప్రత్యక్షం అవుతాడు. రవి – పెంటో డాక్టర్లు కనిపిస్తారు. అయితే ఈ నవల అర్థం చేసుకోవడానికి 'ఐసిసియు' నవల తప్పనిసరిగా చదివి ఉండనక్కర్లేదు.

తెలుగులో 'స్పేస్ ఫిక్షన్' రాయాలనే నా ఆసక్తికి ఫలితమే ఈ నవల.

ఇంగ్లీషులో ఇలాంటి నవలలూ, కామిక్స్, చలన చిత్రాలూ, టి.వి. సీరియల్స్ చాలా వచ్చాయి.

గ్రహాంతర వ్యక్తులూ, గ్రహాంతర యానాలూ, సుదూర గ్యేలాక్సీలకి ప్రయాణాలూ, రోబోట్లూ, అంతరిక్ష నౌకలూ, స్పేస్ ల్యాబ్స్ – మొదలైన విషయాలన్నీ కలగలిపి కొంచెం వినోదం, కొంచెం విజ్ఞానం అందించే సాహిత్యం ఇది.

ఆ స్ఫూర్తితో రాసిన నవల ఇది. అయితే దీనిలో సైన్స్‌కు సంబంధించిన వాస్తవాలే (Facts) కాకుండా, సైన్స్‌కతీతమైన కల్పన (Fiction) కూడా మిళితమై ఉంది. ఇది పాఠకులకి వివరించవలసిన బాధ్యత నాపై ఉంది.

వస్తువులని సృష్టించడం, శక్తితరంగాల రూపంలో కాంతివేగంతో ప్రయాణించడం, చూపుల్లో లేజర్ లాంటి కాంతికిరణాలని ప్రసరింపజేయడం, దాన్ని ఒక ఆయుధంగా వాడటం, కాలంలో ముందుకీ, వెనక్కీ ప్రయాణించడం – వీటన్నిటికీ ప్రస్తుతం శాస్త్రీయమైన ఆధారాలు లేవు. స్పేస్ ఫిక్షన్ సంప్రదాయం మేరకు ఇవన్నీ నేను ఊహించి కల్పించినవి.

సౌర కుటుంబంలోని ఏ గ్రహం, ఉపగ్రహాల్లోనూ జీవరాసులున్నట్లు సైన్స్‌పరంగా ఏ రుజువులూ దొరకలేదు.

ఈ నవలలో రాసిన టైటాన్ నిజంగానే 'శని గ్రహపు ఉపగ్రహాల్లో ఒకటి. కాని ఇది అత్యంత శీతలమైనది. మనిషిని పోలిన వాళ్ళు హ్యూమనాయిడ్స్ ఇక్కడ అండర్‌గ్రౌండ్‌లో ఉండి తర్వాత ప్లీడియస్ అనే గ్యాలాక్సీలోకి పోయి, అక్కడ ఒక గ్రహంలో స్థిరపడి, దానికి 'న్యూ టైటాన్' పేరు పెట్టుకున్నట్లు రాశాను.



కాంతివేగాన్ని మించి ప్రయాణించే అంతరిక్ష నౌకల గురించి ప్రస్తావన THE LIGHT YEARS (By Gary Kinder - Penguins) అనే పుస్తకంలోంచి తీసుకున్నాను.

స్విట్జర్లాండులోని ఆల్ప్స్ పర్వత ప్రాంతాలలోని ఒక పల్లెటూరులో నివసించే ఎడ్వర్డ్ మేలర్ అనే ఒక వ్యక్తి – తరచు తాను గ్రహాంతర నౌకలని చూసేవాడిననీ, గ్రహాంతర వ్యక్తులతో సంభాషించేవాడిననీ, గ్రహాంతర నౌకలని ఫోటో తీశాననీ చెప్పిన విషయాల గురించి పరిశోధన చేసి రాసిన పుస్తకం అది.

ఎడ్వర్డ్ మేలర్ అంతగా చదువుకోలేదు. పైగా వికలాంగుడు. కాని అతను ప్లీడిస్ అనే గ్యాలక్సీ నుంచి వ్యక్తులతో సంభాషించడం, టెలిపతీ ద్వారా సందేశాలు స్వీకరించడం, తీసిన ఫోటోలూ, ఇతర వివరాలూ, 1980–84 ప్రాంతాలలో యూరప్ పత్రికలలో పెద్ద సంచలనాన్ని సృష్టించాయి. అతను చెప్పిన విశేషాలను గురించి అమెరికా, జర్మనీ లాంటి దేశాల నుంచి, 'నాసా' లాంటి సంస్థల నుంచి వెళ్ళిన శాస్త్రజ్ఞులు చివరికి ఏ విషయం కచ్చితంగా తేల్చలేక పోయారు. కాంతివేగాన్ని అధిగమించే 'సిస్టమ్స్' గురించిన సమాచారం ఈ పుస్తకం నుంచి సేకరించగలిగాను. ఇది నిజమైనా, కాకపోయినా కొన్ని వేల – లక్షల కాంతి సంవత్సరాల దూరాల్లో ఉన్న గ్యాలక్సీల మధ్య ప్రయాణించగలగడం ఎలా సాధ్యం – అనే ప్రశ్నకిది ఒక సమాధానంగా కనిపించింది. ఆసక్తి ఉన్నవాళ్ళు ఈ పుస్తకం చదువవచ్చు.

హోరా అనే పాత్రని డాక్టర్ హు (Dr. Who) అనే బిబిసి టెలివిజన్ సిరీస్‌లో 1980లలో వచ్చిన పాత్ర ఆధారంగా సృష్టించడం జరిగింది. ఇతను కాలజ్ఞాని, (Timelord), కాల ప్రయాణికుడు (Time Traveller), అతని నౌక కూడా కాల ప్రయాణం చేయగలిగిన శక్తి కలిగి ఉంటుంది.

అయితే హోరాకి, డాక్టర్ హూకి ఈ రెండు విషయాలలో తప్ప మరే పోలికా లేదు.

ఈ నవలలోని ఆల్జీరియా దేశ వర్ణనలు అక్కడ నేను పనిచేసిన రోజులలోని జ్ఞాపకాలతో రాసినవి. ఆయా పాత్రలు కల్పితాలు. ఎవర్నీ ఉద్దేశించి వ్రాసినవి కావు. అన్ని పాత్రలూ వినోదం కోసం కల్పించబడినవి.

కథాకాలం 1999. అయితే ముందు ముందు పరిస్థితులు మారవచ్చు.

అంతరిక్షంలాగానే అంతరిక్ష సాహిత్యం కూడా పాఠకులకి ఉత్కంఠ కలిగించి నచ్చుతుందని నా ఆశ.

Acknowledgements:

Dr.Who రచించిన రచయితలకి, "Light Years" by Gary Kinder, నండూరి రామమోహనరావుగారి 'విశ్వరూపం' – అన్నింటినీ మించి ఈ నవలని ఓపికగా చదివి, ప్రచురించడానికి అంగీకరించి, మంచిపేరు పెట్టి, ప్రచురించి నన్ను ఎంతో ప్రోత్సహించిన ఆంధ్రప్రభ వారపత్రిక సంపాదకులు, శ్రీ వాకాటి పాండురంగరావ్‌గారికి నా హృదయపూర్వక కృజ్ఞతలు.

డా॥ చిత్తర్వు మధు



# హైహైపాలొనియా!

## ధ్యానానందస్వామి

**“ఓం** నమోనారాయణాయ నమః “ఓం నమోనారాయణాయ నమః!”

మంద్రస్వరంలో ఒక వేయి గొంతులు ధ్యానసమాధిలో ఉచ్చరిస్తున్న నారాయణ మంత్రం. ఆ శబ్ద తరంగాలకు ధ్యానమందిరం అంతా ఒక అద్భుతమైన అతిలోకమైన శక్తితో నిండినట్లు కనిపిస్తోంది. సుమారు వేయిమంది భక్తులు ఒకేసారి మంత్రజపం చేస్తూ ఏకాగ్రతతో ధ్యానం చేసుకోవడానికి అనువుగా నిర్మించిన ధ్యానమందిరం. విశాలమైన పాలరాతి నేలమీద పద్మాసనంలో కూర్చుని వున్న భక్తులు. తెల్లటి ‘సిరామిక్’ రాళ్ళు అంటించబడి పరిశుభ్రంగా మెరుస్తున్న గోడలు. వాటికి అమర్చిన ఫ్లోర్‌సెంటు బల్బుల నుంచి కళ్ళకి ఇబ్బంది కలిగించకుండా జాలువారే మెత్తటి వెలుగు. విశాలమైన హాలులో ఆ చివర నుంచి ఈ చివర దాకా అమర్చబడి మెల్లగా చప్పుడు లేకుండా తిరుగుతున్న సీలింగ్ ఫ్యాన్లు. సెంట్రల్ ఎయిర్ కండీషనింగ్ సదుపాయాలన్నీ వున్నా కూడా ఈ రోజు, వేసవి కాలపు విద్యుచ్ఛక్తి కోత మూలంగా ఆ సదుపాయం లేకుండా ధ్యానం చేసుకోవాల్సి వస్తోంది.

హాలులో ఒకవైపు చివరగా తూర్పు వైపు వున్న వేదికపై పద్మాసనంలో కూర్చుని వున్న స్వామి – ధ్యానానందస్వామి. ఆయన కటూ యిటూ కూర్చుని తాము కూడా జపం చేస్తున్న ముఖ్యశిష్యులు విజ్ఞానానంద, చైతన్యానంద.

స్వామి కూర్చున్న ఆసనం వెనుక వేదికపై మెరుస్తూ ఆరుతూ వెలిగే దీపాలతో ‘ఓం’ అని అక్షరం, దాని నుంచి నలువైపులా ప్రసరించే తరంగ ప్రవాహం.

“ఓం నారాయణ” శబ్ద ప్రవాహంలో అద్భుత ఆధ్యాత్మిక అనుభూతిని పొందుతున్న భక్త సముదాయం.

హైదరాబాద్ నగరానికి ఇరవై ఐదు కిలోమీటర్ల దూరంలో జాతీయ రహదారికి ఒక పక్కగా రెండు కిలోమీటర్ల లోపలికి, పది ఎకరాల స్థలంలో నిర్మించబడిన ఆధ్యాత్మిక పట్టణం అది. ధ్యానానందస్వామి జీవితమంతా చేసిన కృషికి ఫలితం.

ధ్యానమందిరాలూ, ఆరాధనాగృహాలూ నిర్మించారు. భక్తులకి, ఆశ్రమ సిబ్బందికి కూడా నివాసగృహాలు తయారు చేశారు. అశోక వృక్షాలూ, గులాబీ మొక్కలూ, కొబ్బరి చెట్లూ నిండి కళకళలాడే ఉద్యానవనాలూ, వాటి మధ్య చక్కని తారు రోడ్డూ అందంగా ఏర్పరిచారు. దైనందిన అవసరాలకి మాత్రమే కాక, ఉద్యానవనాల్లోని మొక్కలకి, ఫౌంటెన్లకి కూడా సరిపడే నీటి సరఫరా, విద్యుచ్ఛక్తి అన్నీ ఒక్కటొక్కటే సమకూర్చుకున్నారు. ఇంత చేసి ఈనాడు అంతర్జాతీయ





స్థాయికి రాగలిగేసరికి పదిహేనేళ్ళు పట్టింది స్వామికి.

ఆ రోజు చైత్రపూర్ణిమ. ప్రపంచ శాంతి కోసం ప్రత్యేక ధ్యానం చేద్దామని భక్తులందర్నీ సమావేశపరిచారు స్వామి. సాయంత్రం ఆరు గంటల నుంచీ ఏకధాటిగా సాగుతున్న ధ్యానం సుమారు తొమ్మిది గంటలకి ముగిసే సమయం వచ్చింది.

చివరిసారి ‘ఓం నారాయణాయ నమః’ అని స్వామి లేచి నిలుచున్నప్పుడు ధ్యాన సమావేశం ముగిసినందుకు సూచనగా పెద్ద గంట మ్రోగించారు. ఎవరో అదృశ్యవ్యక్తులు వెలిగించినట్లుగా హఠాత్తుగా అగరువత్తుల గంధపు పరిమళం ఆ హాలంతా వ్యాపించింది. ఎక్కడి నుంచో మెత్తని సితార్ సంగీతం సన్నని శబ్దంతో వినిపించసాగింది.

భక్తులంతా ఆధ్యాత్మిక తన్మయత్వంలో మునిగిపోయారు. ఇప్పుడు ఒక్కొక్కరే వేదిక మీద నిలబడి వున్న స్వామి పాదాలకి నమస్కరించి, ఆశీస్సులందుకుని నిశ్శబ్దంగా పక్కనున్న ద్వారం గుండా నిష్క్రమించే కార్యక్రమం మొదలయింది.

నిలుచున్నప్పుడు ధ్యానానందస్వామి కేవలం ఐదడుగుల ఎత్తే వున్నట్లు స్పష్టమై ఆశ్చర్యం కలుగుతుంది. కాని ఆపాదమస్తకం కాషాయ వస్త్రాలూ, పొడుగ్గా జటాజూటాలూ, కళ్ళలోని అనిర్వచనీయమైన తాపమూ, శక్తీ! ఆయనపట్ల నమ్మకం లేనివారికైనా ఒకరకమైన గౌరవం కలుగకమానదు.

ఇదికాక ఈ రోజు ఆయన మెడలో మెరిసే వజ్రాలహారమూ, ఇంకా తల మీద నవరత్నాలూ పొదిగి జిగేల్‌మంటూ మెరుస్తూ కనిపిస్తున్న వజ్ర కిరీటమూ కళ్ళకు మిరుమిట్లు గొలుపుతున్నాయి.

ఎవరో విదేశభక్తుడు భక్తితో సమర్పించిన విలువైన కానుకలు అవి! రత్నాలూ, వజ్రాలూ, బంగారం అంతా కలిపి సుమారు ఏభై లక్షల పైననే విలువ చేయవచ్చు!

భక్తులు ఒక్కొక్కరే పాదాభివందనం చేసి శిష్యుడు చైతన్యానంద ఇస్తున్న తీర్థప్రసాదాలు స్వీకరించి హాలు బయటికి వెళ్తున్నారు. వారిలో నగరంలోని ధనవంతులూ వ్యాపారవేత్తలేకాక, విదేశీయులు కూడా వన్నారు. చిన్న చిన్న కళ్ళతో పచ్చని శరీరఛాయతో వున్న జపనీయులనుంచి, చాలా పొడుగ్గా వుండి, పొట్టి లాగూలు కాని, జీన్స్ కాని ధరించి మెడలో రుద్రాక్షమాలలతో వింతగా కనిపిస్తున్న అమెరికన్‌ల వరకూ అందరూ వరుసలో నిలబడి వున్నారు.

ఇప్పుడు చైతన్యానంద ప్రసాదం ఇస్తుంటే, విజ్ఞానానంద చేతులు కట్టుకుని, వచ్చే భక్తుల వంక చూస్తూ నిల్చుని వున్నాడు. వదులుగా అతను ధరించిన కాషాయ వస్త్రాల్లో, అవసరమైతే ఉపయోగించడానికి వీలుగా ఇజ్రేయల్‌లో తయారైన ‘ఉజీ’ సబ్‌మెషిన్ గన్’ ఉంది.

నిజానికి విజ్ఞానానంద స్వామి వారి అంగరక్షకుడు. ప్రసాదం ఇస్తున్న చైతాన్యనంద కరాటే, జ్యూడో మొదలైన అయుధ రహిత యుద్ధ విద్యలలో ఆరితేరినవాడు.

ద్వారం బయట కూడా కనీసం నలుగురు కాషాయ వస్త్రాల స్వాములు అప్రమత్తంగా నిలిచి వున్నారు.

ఇప్పుడిప్పుడే అమిత ధనవంతునిగా అభివృద్ధి చెందుతున్న ధ్యానానందస్వామి వారికి రహస్యంగా చేసుకున్న రక్షణ ఏర్పాట్లు అవి.

హఠాత్తుగా స్వామి పాదాభివందనన కార్యక్రమానికి అంతరాయం కలిగింది.

ఆయన ఎదురుగా నిలబడిన ఒక జంట అందరిలాగే ముందుకి సాగకుండా, ఆయన ఎదురుగానే చూస్తూ నిలబడిపోవడమే దీనికి కారణం.

ఆ స్త్రీ, పురుషుడూ అరబ్బులలాగా వున్నారు. ఇద్దరూ కనీసం ఆరడుగులపైనే పొడుగ్గా వున్నారు. వారి శరీరం బంగారు ఛాయలోనూ, జుట్టు గిరజాలు తిరిగి అల్యూమినియం రంగులోనూ వుంది. ఇద్దరూ నీలిరంగు జీన్ ఫ్యాంట్లు, కోట్లు, తెల్లరంగు లాటో బూట్లూ ధరించి వున్నారు.

ప్రశ్నార్థకంగా వాళ్ళకేసి చూసిన స్వామి అప్రతిభుడైపోయాడు!

బంగారుఛాయతో, ఏదో లోహంతో చెక్కినట్లున్న ముఖకవళికలూ, మెరిసే నీలిరంగు కళ్ళూ, తీర్చిదిద్దిన నాసిక, ఎర్రటి పెదవులతో చాలా అందంగానూ, మళ్ళీ అదే క్షణంలో అద్భుత శక్తి స్వరూపులుగానూ కనిపించారు.

ఉన్నట్లుండి వాళ్ళిద్దరూ స్వామి తల మీద కిరీటం ఒక్క వుదుటన గుంజుకున్నారు. ఆ స్త్రీ అతని మెడలోని హారం కైవసం చేసుకుంది. వాళ్ళ కళ్ళలోంచి ఏవో కాంతి కిరణాలు స్వామిని స్పృహ తప్పేటట్లు చేశాయి.

చూస్తూన్న ప్రేక్షకుల్లో కలవరం... హాహాకారాలూ..

చైతన్యానంద అంగరఖాలోని మరతుపాకి తీసి పేల్చసాగాడు.

విజ్ఞానానంద పెద్దగా అరిచి పరుగెత్తి పారిపోతున్న ఆ జంటని ఆపడానికి ప్రయత్నించసాగాడు.

ద్వారం వద్ద అప్పుడే నలుగురు స్వాములు తుపాకులు తీసి గురిపెట్టి ఎదురు దాడికి సిద్ధంగా నిలబడ్డారు!

అప్పుడు ఒక అద్భుతం జరిగింది!

అరబ్‌లాగా ఉన్న యువకుడు హఠాత్తుగా విజ్ఞానందస్వామిని మెడ దగ్గిర, నడుం దగ్గర పట్టుకుని గాలిలోకి ఎత్తి తుపాకులు పట్టుకున్న నలుగురు స్వాముల మీదకి విసిరాడు!

గాలిలో రాకెట్‌లాగా దూసుకు వచ్చిన వంద కిలోల బరువున్న ఆ స్వామి ఈ నలుగురి మీద విసురుగా వచ్చి పడడం, వాళ్ళు తేరుకుని తుపాకులు కాల్చే లోపల వాళ్ళకి కళ్ళు చీకట్లు కమ్మేంత వెలుగుపడి, ఏమీ కనబడని పరిస్థితి ఏర్పడింది.

వెలుతురులోంచి అంధకారంలో వచ్చి మళ్ళీ తిరిగి మామూలు కాంతిని చూడగలిగే స్థితిలోకి వచ్చే లోపల, ఆ స్త్రీ పురుషులిద్దరూ నలుగురు స్వాములని ఒక్కొక్కరుగా ఎత్తి విసిరేయడం, తర్వాత బయటికి పారిపోవడం క్షణాల మీద జరిగిపోయాయి.

హాహాకారాలూ, అరుపులూ, కేకలూ, వెలిగి ఆరి మళ్ళీ వెలిగిన దీపాల కాంతులూ, వీటన్నిటి మధ్య ఎక్కడి నుంచో వినిపిస్తున్న సన్నని సితార్ ధ్వనీ...

... ఇంత షాక్‌లోనూ నాసికలకి తెలుస్తోన్న అగరువత్తుల పరిమళం...

ధ్యానమందిరం బయట పెద్ద పెద్ద అంగలతో పరుగెత్తుకు వెళ్ళిపోతున్న ఆ స్త్రీ పురుషులిద్దర్నీ చూసి పరిస్థితిని అర్థంచేసుకున్న ఆశ్రమ సెక్యూరిటీ వేన్ వాళ్ళని వేగంగా వెంబడించసాగింది.

ధ్యానమందిరానికి, బయట ప్రహరీ గోడకి కనీసం రెండు కిలోమీటర్ల దూరం! సన్నని





తారు రోడ్డు కటూ యిటూ అశోక వృక్షాలూ, కొబ్బరి చెట్లూ దూరాన పెద్ద ఇనుప గేటు కిరువైపులా గన్స్‌తో నిలబడిన ద్వారపాలకులు.

వాళ్ళిద్దరూ పరుగెడుతోంటే మామూలు మనుషులు పరిగెత్తినట్లుగాకాక ఎవరో ఒలింపిక్ ఛాంపియన్స్ స్లోమోషన్ ఫొటోగ్రఫీలో పరుగెత్తడంలా కనిపించింది. చాలా పెద్ద పెద్ద అడుగులు వేస్తూ, క్షణంలో ప్రహరీ గోడ దగ్గరకి చేరుకోగలిగారు.

ఎక్కడో మోగుతున్న సైరన్ మోత విని, ఏదో సెక్యూరిటీ సమస్య అని అర్థంచేసుకున్న గేటు కాపలా మనుషులు గన్స్ వాళ్ళ వైపు తిప్పి పేల్చసాగారు.

పున్నమి వెన్నెల కొబ్బరాకుల మీద ప్రతిఫలిస్తున్న రాత్రివేళ నిశ్శబ్దంలో టపటపా తుపాకి చప్పుళ్ళు.. ఎర్రటి కాంతులూ..!

మామూలు వ్యక్తులయితే ఆ తూటాలకి నేల కొరిగిపోయేవారేమో...

కాని అప్పుడే అత్యద్భుతంగా మరొక వింత జరిగింది. అంతవరకూ పరుగెత్తుకు వచ్చిన ఆ స్త్రీ పురుషులు సునాయాసంగా గాలిలోకి ఎగిరి ప్రహరీ గోడ మీదకి వాలగలిగారు.

మరుక్షణం అవతలి వైపు దూకి రోడ్డు మీద మళ్ళీ పరుగెడుతూ దూరాన చీకటిలో, క్షణంలో అదృశ్యం అయిపోయారు.

ఈ లోపల గేటు తెరవడం, బయటికి దూసుకువెళుతున్న స్వామివారి రక్షకభటులున్న మెటాడోర్ వ్యాన్ గంటకి ఎనభై కిలోమీటర్ల వేగంతో బయటికి దూసుకుపోయి బయట రోడ్డు మీద అదే దిక్కుగా వెళ్ళడం క్షణాల్లో జరిగిపోయింది.

"ఎక్కడ వాళ్ళు?" ఆశ్చర్యంగా అడిగాడు వ్యాన్ డ్రైవర్.

ఎంత దూరం పోయినా వాళ్ళ జాడ లేదు. నిజానికి జాతీయ రహదారికి అటూ యిటూ ఎక్కువగా చెట్లు లేవు. ఖాళీ పొలాలూ, కోళ్ళ ఫారాలూ తప్ప.

ఒకటో రెండో లారీలూ, ఏదో దూరప్రాంతానికి వెళ్ళే ఆర్.టి.సి. బస్సూ తప్ప రోడ్డు మీద ఎక్కువ ట్రాఫిక్ కూడా లేదు.

"ఆశ్చర్యంగా వుందే! ఊహకందడం లేదు. ఇంత వేగంగా తప్పించుకోవడం ఎలా సాధ్యం అయింది?" ఒక సెక్యూరిటీ మనిషి అన్నాడు.

"ఇప్పుడు స్వామి వారికి ఏం చెప్పాలి?" ఆ విషయం గుర్తుకురాగానే ఆ వ్యాన్‌లోని నలుగురికీ వణుకు పుట్టుకొచ్చింది.

"అప్పుడే తిరిగి వెళ్ళద్దు భాయ్! కొంచెం చుట్టుపక్కల ఇళ్ళల్లో కోళ్ళ ఫారాలలో, పొలాల్లో ఎక్కడయినా దాక్కున్నారేమో వెదుకుదాం పదండి!" అన్నాడు వాళ్ళలో మరొకడు.

నిశ్శబ్దంగా వున్న వెన్నెల రాత్రిలో బ్యాటరీ లైట్లతో, మాయమైన వాళ్ళిద్దరికోసం వెదకడం ప్రారంభించారు వాళ్ళు.

## అమరసింహా - న్యాన్సీ

"వద్దు!" అన్నది మత్తైన ఆడగొంతు.

"కావాలి! ఇప్పుడే కావాలి!" విస్కీ తాగిన మత్తులో ముద్దుగా వస్తున్న మగగొంతు.



వివిధ రకాలైన సామాన్లతో ఇరుగ్గా వున్నప్పటికీ ఎయిర్ కండీషన్ చేయబడటం వల్ల చల్లగా సౌకర్యంగా వున్న పడక గది.

ఒక పక్కన వున్న చిన్న కలర్ టీవీలో ఎం.టీ.వీలో నుంచి వస్తున్న పాశ్చాత్య సంగీత కళాకారులు గెంతుతున్న దృశ్యాలు. గదిని దాదాపు పూర్తిగా ఆక్రమించిన విశాలమైన డబుల్ కాట్. దానిపైన దొర్లుతున్న నగ్న శరీరాలపైన ప్రతిఫలిస్తున్న నీలిరంగు బెడ్‌లైట్ వెలుతురు.

కండలు తిరిగి బలిష్టంగా వున్న శరీరంతో కెప్టెన్ అమరసింహ, మధ్యవయస్సుతోబాటు తప్పనిసరిగా వచ్చిన ఊదర ఒంటితో పూర్తిగా నగ్నం కావడానికి ఇష్టపడని నాన్సీ!

ఏభై ఏళ్ళు వచ్చినా శరీర సౌష్ఠవం తగ్గని అమరసింహ 'యూనివర్సల్ డిటెక్టివ్ ఏజన్సీ'కి ముఖ్య పరిశోధనాధికారి. మిలటరీ నుంచి రిటైరయి ఏం చేద్దామా అని ఆలోచలోపడిన అతనికి ఈ ఏజన్సీలో తేలికగానే ఉద్యోగం దొరికింది. క్రమంగా ఏజన్సీ యజమాని నమ్మకం, ఆదరణ చాకచక్యంగా సంపాదించుకుని, ముఖ్యమైన పదవిలోకి ఎదిగాడతను.

సైనిక గూఢచారి విభాగంలో పనిచేసిన అనుభవం, వయసు వచ్చినా సౌష్ఠవం తగ్గని శరీరం. అదీకాక అవివాహితుడు. ఎలాంటి పరిశోధనకైనా ఏ బాదరబందీ లేకుండా వెళ్ళిపోతాడు. ఇంటి దగ్గర సంసార బాధ్యతలు లేవు కనుక.

కూపీలు లాగడం, మనుషులని వెంబడించటం. ప్రేలుడు పదార్థాలని "డీఫ్యూజ్" చేయడం. ఎ.కె.47 ఉజీ మొదలైన సబ్ మెషిన్‌గన్స్, గ్రెనేడ్స్ లాంటివి ఉపయోగించడం, చీకటిలో ఇన్‌ఫ్రారెడ్ కెమెరాతో ఫొటోలో తీయడం, దొంగతనంగా తాళాలు తీసి గదులు వెదకడం... ఒకటేమిటి అన్ని విద్యలూ వచ్చు అమరసింహకి.

పరిశోధనే ప్రాణం అతనికి.





అయితే పనిలేనప్పుడు మాత్రం అమరసింహకి తెలిసిన కాలక్షేపం ఒకటే...

విస్కీ తాగడం. నాన్సీతో గడపడం!

నాన్సీ ఏజెన్సీలో చాలాకాలం నుంచి చేస్తున్న టైపిస్టు. పొట్టిగా కత్తిరించిన జుట్టుకీ, ముడతలు పడే ముఖానికి, పెదాలకి కూడా తగిన రంగులు వేసి కనీసం పదేళ్ళు తక్కువ వయసుతో కనిపించగలదు. అలానే కనిపిస్తుంది.

ఇద్దరికి మూడేళ్ళ నుంచి పరిచయం. అభిరుచులు ఒక్కటే. అందువల్ల వీలు దొరికినప్పుడల్లా ఇంట్లో ఏదో ఒక సాకు చెప్పి అమరసింహ దగ్గరికి వచ్చేస్తుంది. నాన్సీ వితంతువు. ఇద్దరు పిల్లల్నీ రెసిడెన్షియల్ స్కూలులో చదువుకు పెట్టేసింది.

ఇక ఇంట్లో పక్షవాతం వచ్చి మంచానపడి వున్న తండ్రి, పగటి సమయాల్లో ఆయనకి సహాయంగా పనిపిల్లవాడు తప్ప ఎవరూ వుండరు. రాత్రిళ్ళు తను బయటికి వచ్చేటప్పుడు తండ్రిని విశ్రాంతి తీసుకోమని ఇల్లు తాళం పెట్టి వచ్చేస్తుంది.

మోడువారిపోయి ఎదురు చూడ్డానికి ఏమీలేని జీవితంలో అమరసింహంతో 'ఎఫైర్' వల్ల మళ్ళీ కొత్త తన్మయత్వం వచ్చిందావిడకు.

"ఇప్పుడు వద్దు?" అంది నాన్సీ ఆక్రమించుకోబోతున్న అమరసింహతో ముఖం మీద ముఖం పెట్టి.

"ఇప్పుడు వద్దా? లేక అప్పుడే వద్దా? అంటే ఇంకా స్టిమ్యులేషన్ కావాలా?" గట్టిగా పెదవులు కొరుకుతూ ముద్దాడసాగేడు. అతని చేతులు ఆమె శరీరాన్ని స్పృశించసాగేయి.

ఎం.టీ.వీలో మాడోనా పెద్ద కీచుగొంతుతో మరొక పాట అందుకుంది. ఉన్మాదంగా ఎలక్ట్రిక్ గిటార్లు మోగసాగాయి. ఉద్దీపన తారస్థాయికి అందుకున్నంత సంతోషంలో...

సరిగ్గా అప్పుడే టెలిఫోన్ మోగింది, ఎలక్ట్రానిక్ సంగీతపు ధ్వనులు చేస్తూ.

"కమాన్. ఫినిష్ ఇట్ ఆఫ్!" అంది నాన్సీ.

ఫోను మోగుతూనే వుంది.

ఎంతో అర్జెంటయితేనే శలవు రోజున తనకి ఇంటి దగ్గరనుంచి ఫోన్ వస్తుందని తెలుసు సింహకి.

ఎందుకంటే ఈ నంబరు యూనివర్సల్ డిటెక్టివ్ ఏజన్సీ యజమాని కైలాష్‌రావుగారికే తెలుసు. ఎంతో కొంపమునిగే పని అయితే తప్ప ఇంటి దగ్గరకి, అందులో ఆఫ్ డ్యూటీరోజు ఫోన్ చేయరు తనకి.

అయినా సరే ఐదు నిముషాల తర్వాతే ఒక టవల్ చుట్టుకుని లేచి వెళ్ళి ఫోను తీశాడు అమరసింహ. ఎలాంటి సమయంలో ఏం జరిగినా కోపం అణుచుకుని శాంతంగా వుండడం అతని కలవాటే!

"ఒ.కే. ఒకే. అమరసింహ స్పీకింగ్!"

"ఏం చేస్తున్నావయ్యా బాబూ! ఐదు నిముషాల్నుంచీ ఫోన్ ఎత్తవు. ఎక్కడికయినా వెళ్ళేవేమోనని ఇకపెట్టెయబోతున్నా!"

"బాత్‌రూంలో వున్నాలెండి సార్. విషయం చెప్పండి!"

"చాలా ముఖ్యమైన విషయమే. నువ్వు తప్ప ఎవరూ చేయలేని ఎసైన్‌మెంట్ ఇది. అందుకనే నిన్ను డిస్టర్బ్ చేయవలసి వచ్చింది. విజయవాడ హైవే పక్కన స్వాములవారున్నారు చూడు...!"

"అవును... మనం వాళ్ళ ఆశ్రమ సెక్యూరిటీ కవర్ చేస్తున్నాం!"

"కరెక్ట్..... ఒక అరగంట క్రితం అక్కడ ఒక బందిపోటు దొంగతనం లాంటిది జరిగింది. మన మనుషులూ, వాళ్ళ ఆశ్రమంలో రక్షణ బాధ్యతలు నిర్వహించే స్వాములూ, అంతా వుండి కూడా ఏమీ చేయలేకపోయారట! ఆల్‌మోస్ట్ అర కోటి రూపాయల విలువగల నగలు పోయాయిట. దొంగలు తప్పించుకు పారిపోయారట. ధ్యానానందస్వాములవారు ఫోన్ చేసి తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టాడు నన్ను."

"స్వాములవారికి తిట్లు వచ్చున్నమాట!"

"మరి? ఆయనా మనిషే కదా! నువ్వు వెంటనే ఆ ఆశ్రమానికి పోయి కేసు పరిశోధన ప్రారంభించు. ఇది సక్సెస్ అయితే నీకు మామూలు ఫీజు కాక సొమ్ములో టూ పర్సెంట్ కమీషన్ నీకు నేనిస్తా! సో... హర్రీఅప్!"

"ఓ.కే. సార్."

నాకే టూ పర్సంట్ అయితే ఈయన ఎంత పట్టేస్తున్నాడో అనుకుంటూ అమరసింహ, బెడ్ మీద అర్ధనగ్నంగా రిలాక్స్ కాలేక అవస్థపడుతున్న నాన్సీని చూసి, "దట్సిట్ నాన్సీ! విన్నావుగా. మరి నువ్వు మీ యింటికి వెళ్ళిపో. నిన్ను స్వయంగా ఇంటి దగ్గర దింపలేకపోతున్నాను... సారీ!" అన్నాడు.

"షిట్!" అంటూ అసంతృప్తిగా లేచి డ్రెస్ కాసాగింది నాన్సీ.

ఐదు నిముషాల తర్వాత టీవీ శబ్దం ఆగిపోయింది. ట్యూబ్‌లైట్ వెలిగింది. ఇద్దరూ నీట్‌గా డ్రెస్ చేసుకుని ద్వారం దగ్గర నిలబడ్డారు.

"బై!" అన్నాడు అమరసింహ.

"మళ్ళీ ఎప్పుడు?" అంది నాన్సీ.

"చూద్దాం... భగవంతుడి దయ వుంటే ఒక వారంలో! లేకపోతే.. ఎప్పుడో!" అన్నాడు సింహ.

మరో పది నిముషాలకి నాన్సీ లూనా బషీర్‌బాగ్ వైపూ, అమరసింహ మోటార్ సైకిల్ విజయవాడ రోడ్ వైపూ ప్రయాణించసాగాయి.

# డాక్టర్ శిల్ప

**వి**జయవాడ - హైదరాబాద్ జాతీయ రహదారికి అటు యిటూ కాలక్రమేణా ఎన్నో కాలనీలు వెలిశాయి.

ధ్యానానందస్వామి వారి ఆధ్యాత్మిక నగర్ 25వ కిలోమీటరు దగ్గర వుంటే, హయత్‌నగర్ కాలనీ ఇంచుమించు 16వ కిలోమీటర్ దగ్గర వుంది.

ఈ రెండు కాలనీల మధ్య వుంది భరత్‌నగర్ కాలనీ. రోడ్డు మీద నుంచీ కాలనీలోకి అర్ధ కిలోమీటరు దూరం. పూర్వం పంటపొలాలుగా వున్న వాటిని ఇళ్ళ స్థలాలుగా మార్చి కారు





చౌకగా ఇళ్ళు కట్టించి ఇచ్చారు ఏదో సొసైటీ వాళ్ళు. అన్నీ మధ్యతరగతి వాళ్ళు నివసించే నిరాడంబరమైన ఇళ్ళు. కాలనీలో ప్రవేశించగానే మొదటగా కనబడే ఇల్లు మిగిలిన వాటికంటే కొంచెం కొత్తగానూ, చుట్టూ పూలమొక్కలతోనూ అందంగా, ఆకర్షణీయంగా వుంది. ఇంటి ముందు కొబ్బరి చెట్లూ, గులాబీ మొక్కలూ, వాటికి అనుకుని చిన్న ప్రహారీ గోడ, గోడకి మధ్యగా చిన్న ఇనుప గేటు దానికి తగిలించి ఉన్న బోర్డు తెల్లగానూ, అక్షరాలు నల్లగానూ ఉన్నాయి.

"+ క్లినిక్ + డాక్టర్ ఎస్.శిల్ప ఎం.బి.బి.ఎస్." బోర్డు మీదకి వెలుతురు పడేట్లు ఇది చికిత్సాలయం అని తెలిసేందుకూ ఎర్రలైటు అమర్చివుంచారు. అది ఇప్పుడు వెలుగుతోంది.

ముందు గది తలుపులు వేసి వున్నాయి. లోపల టేబుల్, దాని ముందు ఆఫీస్ ఛైర్, రోగులని పరీక్షించే బల్ల ఒకటీ, స్టెరిలైజర్, ఇంజెక్షనులు చేసేందుకు సిరంజీలూ, చిన్న చిన్న శస్త్ర చికిత్స చేసే పరికరాలూ మొదలైనవి వున్న స్టీలు ట్రేలు, అల్మైరాలో వైద్య పుస్తకాలు.

కుర్చీలో నిజంగానే శిల్పం లాంటి కనుముక్కు తీరు కలిగి తెల్లగా నాజూగ్గా ఉన్న శిల్ప వెనక్కి జేరగిలబడి కళ్ళు మూసుకుని ఆలోచనల్లో తేలిపోతుంది.

రాత్రి కూడా పగటి కలల్లో తేలిపోయే వయసే మరి! ఇరవై మూడేళ్ళ శిల్ప ఇంకా పూర్తి డాక్టరు కాలేదు. అంటే ఆఖరి సంవత్సరం పాసయి హౌస్ సర్జన్ చేస్తోంది. నిజానికి ట్రైనింగ్ పూర్తి అయితేగాని ప్రాక్టీస్ చేయకూడదని నిబంధనలున్నా - అప్పుడే బోర్డు కట్టేసింది. కాలనీలో రోజూ ఎవరో ఒకరు బి.పి. చూడమనో, సూది ఇవ్వమనో, జ్వరం వచ్చింది మందులు రాసిమ్మనో వస్తూనే ఉంటారు. హౌస్ సర్జన్ కిచ్చే జీతం కాక మరో వేయి రూపాయిలో, పదిహేను వందలో అదనంగా పాకెట్‌మనీ కింద వస్తున్నాయి. ఎందుకు సంపాదించుకోకూడదు! పైగా ఊరికి ఇంత దూరంగా శివార్లలో ఉన్న కాలనీలో మరొక డాక్టర్ గానీ, క్లినిక్ గానీ లేదు.

అందంగా ఉంటుంది శిల్ప. విశాలమైన నల్లటి కళ్ళూ, కొనదేరిన ముక్కూ, తెల్లని శరీరఛాయకి తోడు ఎర్రని పెదాలూ, పొడుగాటి వాలుజడా, అందంతో సమానమైన తెలివి తేటలు కలది కూడానూ. అందుకే ఒక్క సంవత్సరం కూడా ఫెయిల్ కాకుండా ఎంబిబిఎస్ పూర్తి చేసింది. ఇక హౌస్ సర్జన్సీ కొద్ది నెలల్లో అయిపోతే డిగ్రీ చేతికొచ్చేస్తుంది. తండ్రి జగన్నాథంగారు బ్యాంక్ ఆఫీసరుగా రిటైరయ్యారు. అమ్మ విశాలాక్ష్మి, ఎంతో మంచిది. టైం ప్రకారం టిఫినూ, కాఫీ అన్నీ అమర్చి పెడుతుంది. ఒక్కగానొక్క అన్నయ్య ఉన్నాడుగాని అతను పెళ్ళాం చెబితే వినాలి అనుకునే మనిషి. ఎక్కడో దూరంగా అమీర్‌పేటలో కాపురం ఉంటున్నాడు.

లోపల డ్రాయింగ్ రూంలో కూర్చుని తల్లీ తండ్రీ టీవీ చూస్తున్నారు. వీధి గదిలో శిల్ప కళ్ళు మూసుకుని కూర్చుని, ప్రొద్దుట హస్పిటల్‌లో జరిగిన విషయాలు తలుచుకుంటోంది.

ఫిమేల్ మెడికల్ వార్డు, వార్డంతా వివిధ రకాల జబ్బులున్న రోగులతో నిండిపోయింది.

వెనుక పదిహేనుమంది వైద్య విద్యార్థులు వినయంగా నడిచి వస్తూండగా, చుక్కల్లో చంద్రుడిలాగా వార్డ్‌లో ప్రవేశించాడు డాక్టర్ అభిజిత్. మెడికల్ గ్రాండ్ రౌండ్స్ అన్నమాట. అంటే విద్యార్థులందరినీ వెంటవేసుకుని, ఒక్కొక్క వార్డులో వివిధ రకాల వ్యాధిగ్రస్తులని చూపిస్తూ ప్రశ్నలడుగుతూ, వ్యాధి లక్షణంతో, రోగ నిర్ణయం ఎలా చేయాలో బోధిస్తారన్నమాట.

శిల్ప ఆ వార్డులో హౌస్ సర్జన్ చేస్తోంది. గబగబా వచ్చి తను కూడా ఆసక్తిగా విద్యార్థుల వెనుకనే నిలబడింది.

“కమాన్ క్విక్! రోగి ముఖం చూసి వేగంగా డయాగ్నసిస్ చెప్పండి” తీక్షణంగా అడిగాడు అభిజిత్, ముందు వరుసలో బిత్తరపోయి చూస్తున్న అమ్మాయిని.

విద్యార్థులందరూ తెల్ల కోట్లు వేసుకుని చేతుల్లో నోట్‌బుక్స్, పెన్స్‌తో భయంగా నిలబడి వున్నారు. మెడిసిన్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ అభిజిత్ పొడుగ్గా ఠీవిగా తెల్లగా రాజకుమారుడిలాగా ఉంటాడు. అతని గిరజాల జుట్టూ, నల్లటి కళ్ళూ అటుంచి, అతను చాలా తెలివిగలవాడనీ, వైద్యంలో మెలకువలన్నీ అద్భుతంగా బోధించగలడనీ విద్యార్థుల్లో మంచిపేరుంది.

శిల్పకి అతని క్లాసులంటే ఇష్టం. అతని తార్కిక విశ్లేషణ, పరిశీలన, వ్యాధి నిర్ణయంలోని నేర్పు అన్నీ భలే ఆసక్తికరంగా ఉంటాయి. అదీకాక పెళ్ళి కాని అందమైన ఎం.డి. డాక్టర్ నేడో, రేపో అమెరికాకు వెళ్ళడానికి అర్హమైన పరీక్షలు పాసయినవాడు. పెళ్ళికాని ఆడ పిల్లలందరి గుండెల్లో జలతరంగపు సంగీతం మోగించగలిగే వ్యక్తిత్వం గలవాడు డాక్టర్ అభిజిత్.

మొదటి వరుసలో వణికిపోతూ నిలబడివున్న వైద్య విద్యార్థిని బెరుకుగా “టీబీ” అన్నది.

“నాన్‌సెన్స్...! మీకెంత ట్రైనింగ్ ఇచ్చినా కనీసం జబ్బు పేరు చెప్పడం కూడా సరిగా రావటం లేదు. రోగి ముందు ఆ జబ్బు పేరు చెబితే అతను బాధ పడతాడనీ, కాక్స్ (అంటే క్షయవ్యాధి క్రిమిని కనిపెట్టిన శాస్త్రవేత్త పేరు) అనే పేరుతో చెప్పమనీ ఎన్నిసార్లు చెప్పాను? ఏమైనా, నీ డయాగ్నిసిస్ తప్పు, నెక్స్‌ట్!” దృఢమైన స్వరంతో వేలుపెట్టి చూపిస్తూ ఆమె పక్కనున్న విద్యార్థిని ప్రశ్నించాడు అభిజిత్.

“ఎనీమియా (రక్తహీనత)” అన్నాడు నీరసంగా ఆ అబ్బాయి.

తల పట్టుకున్నాడు అభిజిత్.

“మీకెలా శిక్షణ ఇవ్వాలి, కమాన్ డిస్క్రైబ్ హర్! నువ్వు రోగిలో ఏం చూస్తున్నావో కనీసం సరిగ్గా వర్ణించగలిగితే నీకే జబ్బో తెలిసిపోతుంది!”

నిశ్శబ్దం!

వెనుక వరుసలో వున్న శిల్ప చకచకా తన స్కెచ్ పెన్ తీసేసుకుని నోట్ బుక్‌లో బొమ్మ గీయసాగింది.

కేస్ గురించి చెప్పసాగాడు అభిజిత్.

“చాలా సన్నగా పొడుగ్గా ఉన్న రోగి, చేతులు వణుకుతున్నాయి. కళ్ళు చాలా పెద్దగా, మనవంక రెప్పలార్పకుండా చూస్తోంది. చెమటలు ఎక్కువగా పట్టడం, గుండె దడ, ఆయాసం... సీహర్ ఫేస్, వ్యాధి చప్పున బోధపడుతుంది?”

మంచి చిత్రకారిణి శిల్ప. రాసుకునే బదులు ఆ చెప్పిన లక్షణాలుగల రోగి బొమ్మ గీసింది పుస్తకంలో. బొమ్మ చూడగానే జబ్బు పేరు జ్ఞాపకం వచ్చింది. ఇక సందేహం లేదు.

“థైరో టాక్సికోసిస్ (మెడలో ఉండే థైరాయిడ్ గ్రంథి సరిగ్గా పనిచేయకపోతే వచ్చే వ్యాధి)” అని అరిచింది వెనుక నుంచి.

“ఎవరది?” తీక్షణంగా చూశాడు డాక్టర్ అభిజిత్.





ఆమె ధరించిన తెల్లకోటుకి తగిలించి వున్న చిన్న తెల్లటి నేమ్ ప్లేట్ మీద డాక్టర్ శిల్ప ఎం.బి.బి.ఎస్. అని రాసి ఉంది.

“కరెక్ట్‌గానే చెప్పావు. కాని నేను నిన్నడగటం లేదు డాక్టర్ శిల్పా. ఎందుకంటే నువ్వు పాసయిపోయిన డాక్టర్‌వి. సరే. వాళ్ళందరికీ నువ్వు ఈ వ్యాధి ఎలా డయాగ్నిసిస్ చేశావో చెప్పు కనీసం...”

ఊహల్లో ఉన్న రూపాన్ని అచ్చుగుద్దినట్లు గీయగలదుకాని, మాటలతో చెప్పడం అసలు చేతకాదు శిల్పకి. బెరుగ్గా ఏదో చెప్పబోయినా అస్పష్టంగా ఏవో మాటలు తడబడుతూ వచ్చాయి తప్ప కేసు గురించి చెప్పలేకపోతోంది.

“అరే. డయాగ్నసిస్ సరిగ్గా చెప్పి, ఎలా చెప్పావంటే చెప్పలేకపోతే ఎలా?” ఆశ్చర్యంగా విద్యార్థుల గుంపులోంచి నడుచుకుంటూ వచ్చాడు అభిజిత్. శిల్ప చేతిలో నోట్‌బుక్, పెన్సిల్ చూసి “గివ్ మి దట్ బుక్” అని చూడబోయిన అతని ఆశ్చర్యానికంతులేదు. ‘థైరోటాక్సికోసిస్’ రోగి ఎలా ఉంటుందో ఖచ్చితంగా పాఠ్యపుస్తకంలో ఉన్నట్లుగా బొమ్మగీయబడి ఉండటం చూసి, “ఫాంటాస్టిక్. రోగుల గురించి ఈ విధంగా జ్ఞాపకం పెట్టుకోవడం మొదటిసారి చూస్తున్నాను. వెరీగుడ్. మీరు మంచి చిత్రకారిణి అన్నమాట!” అని అభినందిస్తూ ఆ బొమ్మ తీసి అందరికీ చెప్పసాగాడు.

“చూడండి... ఇది ఈ జబ్బు వున్న వ్యక్తి లక్షణాలు చాలా ఖచ్చితంగా చిత్రించిన చిత్రం. పెద్ద పెద్ద కళ్ళు మన వంక తదేకంగా చూస్తున్నట్లు – ఆ చూపులూ దీన్ని ‘ఎక్స్ ఆఫ్తల్మాస్’ అంటారు. మెడ ముందు భాగంలో పెద్ద గడ్డలా కనిపిస్తున్న థైరాయిడ్ గ్రంథి ఇదుగో. ఆమె శరీరంలో ‘మెటబాలిజం’ ఎక్కువగా జరగడం వల్ల మనిషి చాలా చిక్కిపోయి, గాభరాగా వుంది. చెమటలు పడుతూ వుంటాయి” – ఈ విధంగా చెప్పసాగాడు.

క్లాసు అయిపోయినాక విద్యార్థులంతా బయటికి వెళ్ళిపోయారు. అభిజిత్, శిల్పా, నర్స్, వార్డుబోయ్ వెంటరాగా వార్డ్ రౌండ్స్ చేస్తుండగా అతను అడిగాడు ఈసారి కొంచెం మర్యాదపూర్వకంగా.

“మీరు ఏ వ్యాధికైనా సరే రోగి ఎలా వుంటాడో ఊహించి బొమ్మ గీయగలరా?”

“అన్నింటికీ కాదు. ప్రత్యేకంగా కొట్టొచ్చినట్టు కనిపించే వ్యాధిగ్రస్తుల లక్షణాలని చిత్రించగలను. ఎంత చదివినా జ్ఞాపకం వుండేవి కావు. అందుకని ఇలా బొమ్మల రూపంలో వేసుకొని గుర్తుంచుకోవడం అలవాటు చేసుకున్నాను” అన్నది శిల్ప.

“ఎవరినైనా చూసి బొమ్మ వేయగలరా?”

“అంటే ‘కారికేచర్’లాగా చప్పున వేయగలను. కానీ గీతలతో వర్ణించినంత విశదంగా మాటలతో చెప్పలేను. అందుకనే ‘వైవా’ (ముఖాముఖి ప్రశ్నలడిగే వైద్యపరీక్ష)లో తక్కువ మార్కులొచ్చాయి” అని చెప్పి నవ్వింది శిల్ప.

“నా బొమ్మ వెయ్యండి చూద్దాం” కుతూహలంగా అడిగాడు అభిజిత్.

నలుపు, ఎరుపు, నీలం రంగులున్న స్కెచ్‌పెన్ తీసి నోట్‌బుక్‌లో చకచకా గీయసాగింది. పది నిముషాలకి డాక్టర్ అభిజిత్ రేఖాచిత్రం కాగితం మీద వెలిసింది.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=697**

*** * ***

**Read other books of Dr. Chittarvu Madhu @**

**http://kinige.com/kbrowse.php?via=author&id=169**